సాక్షి
కుమురం భీం
7
సోమవారం : 2 : జూన్ : 2025

వేడుకలకు ముస్తాబు

జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు నిర్వహించనున్నారు. ముఖ్య అతిథి శాసన మండలి డిప్యూటీ చైర్మన్ జి.ప్రకాశ్ ఉదయం 9.45 గంటలకు చిల్డ్రన్స్ పార్క్‌లోని అమరవీరుల స్తూపానికి నివాళులర్పించనున్నారు. ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లో జాతీయ పతకాన్ని ఆవిష్కరించి, 10.10 గంటలకు జిల్లా ప్రగతిపై ప్రసంగించనున్నారు. కలెక్టరేట్‌ను సుందరంగా ముస్తాబు చేశారు.


విద్యుత్ దీపాల వెలుగుల్లో కలెక్టరేట్

న్యూస్‌రీల్

బెస్ట్ అవైలెబుల్ స్కూళ్లలో ప్రవేశాలు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలోని బెస్ట్ అవైలెబుల్ స్కూళ్లలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి సజీవన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం కింద ఒకటో తరగతికి(నాన్ రెసిడెన్షియల్) 38 సీట్లు, ఐదో తరగతికి(రెసిడెన్షియల్) 40 సీట్లు కేటాయించారని పేర్కొన్నారు. అర్హత గల షెడ్యూల్ కులానికి చెందిన విద్యార్థులు కులం, నివాసం, ఆదాయ ధ్రువ పత్రాలతోపాటు ఆధార్ కార్డు, మూడు ఫొటోలతో ఈ నెల 16లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఒకటో తరగతి విద్యార్థులు 2019 జూన్ 1 నుంచి 2020 మే 31 మధ్య జన్మించి ఉండాలన్నారు. ఈ నెల 20న లక్కీడ్రా ద్వారా విద్యార్థులను ఎంపిక చేస్తామని, మరిన్ని వివరాలకు 63096 74769 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

రేపటి నుంచి 'పది' సప్లిమెంటరీ పరీక్షలు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో ఈ నెల 3 నుంచి 13 వరకు పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా పరీక్షల నిర్వహణ అధికారి ఉదయ్‌బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసిఫాబాద్ బాలికల ఉన్నత పాఠశాల, కాగజ్‌నగర్ బాలుర ఉన్నత పాఠశాల, సిర్పూర్(టి) ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు కొనసాగుతాయన్నారు. జిల్లాలో 680 మంది పరీక్షలు రాయనున్నారని, విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా వసతులు కల్పించినట్లు తెలిపారు. విద్యార్థులు ముందే కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.

సైక్లింగ్‌తో ఆరోగ్యం


ర్యాలీ ప్రారంభిస్తున్న రాజేశ్, తదితరులు

ఆసిఫాబాద్‌అర్బన్: నిత్యం సైక్లింగ్ చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉండొచ్చని ఆర్ఎస్ఐ రాజేశ్, గిరిజన క్రీడా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జంగు అన్నారు. ఈ నెల 3న ప్రపంచ సైకిల్ దినోత్సవం నేపథ్యంలో ప్రజల్లో ఆరోగ్యపరమైన అలవాట్లు పెంపొందించడం, సైక్లింగ్ ద్వారా శారీరక దృఢత్వం సాధించడం, పర్యావరణ పరిరక్షణకు తోడ్పడటం లక్ష్యంగా ఆదివారం జిల్లా కేంద్రంలో ఫిట్ ఇండియా- సండేస్ ఆన్ సైక్లింగ్ ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో అత్యాపత్యా ఇండియా కోచ్ కడ్తల రాకేశ్, శ్రీకాంత్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలి


చిన్నారులతో యూటీఎఫ్ నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతికుమారి అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం ఎంఈవో సుభాశ్, సంఘం నాయకులతో కలిసి యూటీఎఫ్ బడిబాట ప్రచార జాతను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ బడి బాధ్యత మనదే అనే సంకల్పంతో యూటీఎఫ్ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా బడిబాట జాత నిర్వహిస్తామని తెలిపారు. జిల్లాలో 36 పాఠశాలలు మూతబడినట్లు సమాచారం ఉందని, విద్యార్థులు ఉన్నచోట వాటిని తెరిపించేందుకు కృషి చేస్తామన్నారు. ఆసిఫాబాద్ మండలం బాబాపూర్ పరిధిలోని బాబాపూర్ తండాలో పదేళ్ల క్రితం పాఠశాల మూతపడిన విషయం తెలుసుకుని, గ్రామంలో ఇంటింటికీ తిరిగి 15 మంది విద్యార్థులను చేర్పించేలా తల్లిదండ్రులను ఒప్పించామని తెలిపారు. డీఈవో యాదయ్య దృష్టికి ఈ విషయం తీసుకెళ్లి, పాఠశాలను పునఃప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌వో మధుకర్, యూటీఎఫ్ నాయకులు ఇందురావు, రమేశ్, హేమంత్, రాజకమలాకర్ రెడ్డి, తిరుపతి, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

పోడు రగడ

- భూముల స్వాధీనానికి అధికారుల చర్యలు
- రైతులు, అటవీశాఖ మధ్య వివాదాలు


చింతలమానెపల్లి మండలం దిందాలో పోడు రైతులతో మాట్లాడుతున్న అటవీశాఖ అధికారులు(ఫైల్)

చింతలమానెపల్లి(సిర్పూర్): రైతులు ఓ వైపు సాగుకు సన్నద్ధమవుతుండగా, మరోవైపు అటవీ భూముల స్వాధీనానికి అటవీశాఖ అధికారులు చర్యలు చేపట్టడంతో జిల్లాలో పోడు భూముల రగడ మొదలైంది. పలు మండలాల్లో నిత్యం అటవీశాఖ, రైతుల మధ్య వాగ్వాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఆసిఫాబాద్ డివిజన్‌లోని కెరమెరి, సిర్పూర్(యూ), లింగాపూర్, తిర్యాణి, కాగజ్‌నగర్ డివిజన్‌లోని సిర్పూర్(టి), కాగజ్‌నగర్, చింతలమానెపల్లి, బెజ్జూర్, పెంచికల్‌పేట్ మండలాల్లో పోడు భూముల వివాదాలు ఎక్కువగా ఉన్నాయి. సిర్పూర్(టి) మండలం ఇటిక్యాల పహాడ్, చింతలమానెపల్లి మండలం డబ్బా, దిందా గ్రామాల్లో పోడుభూముల స్వాధీనానికి అధికారులు సిద్ధం కాగా స్థానికులు అడ్డుకున్నారు.

ఇటీవలి ఘటనలు

- చింతలమానెపల్లి మండలంలోని దిందా శివారులోని బందెపల్లి బీట్‌లో భూముల స్వాధీనానికి అధికారులు చర్యలు చేపట్టారు. మే 21న కందకాలు తవ్వకం పనులు చేపట్టగా గ్రామస్తులు అడ్డుకున్నారు.
- మే 27న డబ్బా, అడెపల్లి గ్రామాల శివారులోని పోడు భూముల స్వాధీనానికి అధికారులు ప్రయత్నించగా, ఆయా గ్రామాల రైతులు అడ్డుకున్నారు. స్థానికులు ఆందోళన చేయడంతో అధికారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.
- మే 23న బెజ్జూర్ మండలం పాపన్‌పేట్ శివారులో పత్తి చేలలో పనులు నిర్వహించకుండా అడ్డుపడ్డారు.

పెరుగుతున్న సాగు విస్తీర్ణం

జిల్లావ్యాప్తంగా 2,437 చదరపు కిలోమీటర్ల అడవులు ఉండగా, కాగజ్‌నగర్, సిర్పూర్(టి), ఖర్జెల్లి, బెజ్జూర్, పెంచికల్‌పేట్, ఆసిఫాబాద్, తిర్యాణి, కెరమెరి, రెబ్బెన ఫారెస్టు రేంజ్‌లు ఉన్నాయి. జిల్లాలో ఏటా పోడు సాగు విస్తీర్ణం పెరుగుతోంది. జిల్లావాసులు ప్రధానంగా వ్యవసాయమే జీవనాధారంగా జీవిస్తున్నారు. 50 సంవత్సరాలుగా కొనసాగుతున్న పోడు వ్యవసాయం.. ప్రతీ ఏడాది పెరుగుతూ పోయింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అటవీహక్కుల చట్టం- 2005 ప్రకారం గిరిజనులకు పోడు పట్టాలు పంపిణీ చేశారు. 2018 ఎన్నికల సందర్భంగా పోడు భూములకు పట్టాలు ఇస్తామని హామీలు ఇచ్చారు. ప్రభుత్వం 2021లో పోడు భూములకోసం దరఖాస్తులు స్వీకరించి జీవో 140 అనుసరించి పోడు హక్కుదారులను ఎంపిక చేశారు. 2023 జూన్ 30న జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో పోడు పట్టాల పంపిణీని అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ లాంఛనంగా ప్రారంభించారు.

తరచూ వివాదాలు

పోడు భూముల విషయంలో అటవీశాఖ అధికారులు సున్నితంగా వ్యవహరించాలని ప్రజాప్రతినిధులు పలు సందర్భాల్లో సూచించినా వివాదాలు కొనసాగుతున్నాయి. ఇటీవల జిల్లాలో పర్యటించిన ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క పోడు రైతులతో అధికారులు దురుసుగా ప్రవర్తించవద్దని, అవసరమైన చోట అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అలాగే కొత్త భూములు కొట్టేది లేదని, పాత భూములు వదిలేది లేదని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు తేల్చి చెప్పారు. పోడు భూముల రైతులకు అండగా ఉంటామని ఎమ్మెల్సీ దండె విఠల్ ప్రకటించారు. రాజకీయంగా కీలకంగా మారిన పోడు భూముల వివాదాలకు అడ్డుకట్ట పడటం లేదు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన విధానం లేకపోవడంతో సమస్య తీవ్రతరమవుతోంది. గిరిజనులకు మాత్రమే పోడు భూములపై హక్కులు ఇస్తామని ప్రభుత్వం చెబుతుండగా, గిరిజనేతరులు సైతం సాగులో ఉన్నారు. దశాబ్దాలుగా సాగు చేస్తున్న భూములు అధికారులు స్వాధీనం చేసుకుంటే ఉపాధిని కోల్పోతామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యామ్నాయ చర్యలు లేకుండా భూముల స్వాధీనానికి అధికారులు ప్రయత్నిస్తుండటంతో ప్రజలు తిరగబడి ఆందోళనకు దిగుతున్నారు.

జైహింద్‌పూర్‌లో నిరసనలు


మూడో రోజు నిరసన దీక్ష చేస్తున్న రైతులు

పెంచికల్‌పేట్(సిర్పూర్): పెంచికల్‌పేట్ మండలం జైహింద్‌పూర్ గ్రామ శివారులో పోడు భూముల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని అడ్డుకోవడానికి శుక్రవారం నుంచి రైతులు చేపట్టిన నిరసన దీక్షలు కొనసాగుతున్నాయి. ఓ వైపు పోడు భూముల్లో మొక్కలు నాటడానికి అటవీశాఖ అధికారులు, మరోవైపు భూముల కోసం పోడు రైతులు చేలలోనే పడిగాపులు కాస్తున్నారు. మూడు రోజులుగా అటవీ ప్రాంతంలో పోడు రగడ కొనసాగుతోంది. పంట భూములు ఇచ్చేది లేదని రైతులు తేల్చిచెప్పడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. రైతులు కుటుంబ సభ్యులతో పగలు, రాత్రి భూముల్లోనే నిరసన వ్యక్తం చేస్తున్నారు.

160 ఎకరాల భూమి

జైహింద్‌పూర్ గ్రామానికి చెందిన సుమారు 40 బీసీ వర్గానికి చెందిన రైతులు బెజ్జూర్ రేంజ్ పరిధిలో 160 ఎకరాల్లో పోడు సాగు చేసుకుంటున్నారు. ఇటీవల అటవీశాఖ అధికారులు 120 ఎకరాల్లో మొక్కలు నాటడానికి భూములు చదును చేయడానికి వచ్చారు. గ్రామానికి చెందిన రైతులు అధికారులు అడ్డుకున్నారు. ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. రైతులకు మద్దతుగా ఈ నెల 26న అక్కడికి చేరుకున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు పోడు రైతులకు ఇబ్బందులు కలిగించవద్దని సూచించారు. అధికారుల తీరుతో రైతులు మహిళలు, చిన్నపిల్లలతో శుక్రవారం నుంచి పోడు భూముల్లోనే నిద్రాహారాలు చేస్తూ నిరసన దీక్షలు కొనసాగిస్తున్నారు. శనివారం రాత్రి నిద్రిస్తున్న సమయంలో నగేశ్ అనే రైతు తీవ్ర అస్వస్థతకు గురికావడంతో తోటి వారు చికిత్స కోసం కాగజ్‌నగర్ పట్టణానికి తరలించారు. ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూముల్లో అటవీశాఖ అధికారులు వచ్చి సాగు పనులు అడ్డుకోవడం ఏంటని రైతులు ప్రశ్నిస్తున్నారు. ప్రాణాలు పోయినా భూములు వదులుకోమని భీష్మించుకు కూర్చున్నారు. తమ భూముల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని వెంటనే విరమించుకోవాలని, లేని పక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరిస్తున్నారు.

భూములు వదులుకోం



ఏళ్లుగా జైహింద్‌పూర్ గ్రామశివారులో పోడు భూములు సాగు చేసుకుంటున్నాం. ఏటా సాగు పనులను అడ్డుకుంటున్నారు. ప్లాంటేషన్ పేరుతో మా భూములు లాక్కుంటున్నారు. భూమినే నమ్ముకుని కుటుంబాలు పోషించుకుంటున్నాము. పోడు భూములను అటవీశాఖ అధికారులు లాక్కుంటే కుటుంబాలు రోడ్డునపడతాయి. ప్రాణాలు పోయినా పోడు భూములు వదులుకోం.

– జాబరి శంకర్, రైతు, జైహింద్‌పూర్

టీఆర్‌నగర్‌లో నీటి కటకట

- 20 రోజులుగా నిలిచిన భగీరథ నీటి సరఫరా


నిరసన తెలుపుతున్న ప్రజలు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని టీఆర్‌నగర్ కాలనీలో 20 రోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోయింది. కాలనీవాసులు కిలోమీటర్ దూరంలోని పెద్దవాగు నుంచి నీటిని తెచ్చుకుంటున్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కలుషిత నీటితో వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం కాలనీవాసులు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. టీఆర్‌నగర్ కాలనీలో 120 కుటుంబాలకు కేవలం ఒకే చేతిపంపు ఉంది. గంటల తరబడి నీటికోసం చేతిపంపు వద్ద నీటి కోసం వేచిచూడాల్సి రావడంతో కూలీ పనులకు వెళ్లలేకపోతున్నారు. కాలనీలో మరో బోర్ ఉండగా, మోటార్ చెడిపోయింది. ప్రతీసారి తామే డబ్బులు జమ చేసి మరమ్మతులు చేయించుకుంటున్నామని, ప్రస్తుతం చెడిపోయిన మోటార్‌ను ఇప్పటికీ అధికారులు బాగు చేయించలేదని కాలనీవాసులు తెలిపారు. భగీరథ నీటిని సరఫరా చేయాలని, లేనిపక్షంలో కలెక్టరేట్ వద్ద ఖాళీ బిందెలతో ధర్నా చేపడతామని హెచ్చరించారు.

సమస్య పరిష్కరించాలి



కాలనీలో 20 రోజులుగా నీటి సరఫరా లేకపోవడంతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నాం. కొన్నేళ్లుగా సమస్య వెంటాడుతోంది. అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. భవిష్యత్తులో నీటిఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి.

– మాధవి, టీఆర్‌నగర్

నిత్యం పర్యవేక్షించాలి



టీఆర్‌నగర్ కాలనీలోని సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధులు నిత్యం పర్యవేక్షించాలి. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని స్వచ్ఛమైన నీటిని సరఫరా చేయాలి. లేని పక్షంలో కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపడతాం.

– సుజాత, టీఆర్‌నగర్

పోరుగడ్డలో 'భగీరథ' బంద్


నీటిని మోసుకెళ్తున్న ఆదివాసీలు

కెరమెరి(ఆసిఫాబాద్): కెరమెరి మండలంలోని భీం పోరుగడ్డ జోడేఘాట్‌లో ఆదివాసీలకు తాగునీటి తిప్పలు తప్పడం లేదు. 50 కుటుంబాలు గ్రామానికి దూరంగా ఉన్న చేతిపంపుపై ఆధారపడి కాలం వెల్లదీస్తుండగా ప్రస్తుతం అది అడుగంటిపోయింది. మిషన్ భగీరథ నీటి సరఫరా కూడా ఐదు రోజులుగా నిలిచిపోవడంతో దాహానికి అల్లాడుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో మ్యూజియం కోసం ఏర్పాటు చేసి బోరు నుంచి నీటిని తెచ్చుకుంటున్నారు.

విత్తనంపై అప్రమత్తం!

- 'నకిలీ'తో జాగ్రత్త
- తక్కువ ధరను చూసి మోసపోవద్దు
- రైతులకు సూచిస్తున్న అధికారులు

జిల్లాలో వానాకాలం సాగు అంచనా

పంటరకం	ఎకరాలు
పత్తి	3,35,363
వరి	56,861
కంది	30,430
ఇతర పంటలు	22,395


గిన్నెధరిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ అధికారి

జిల్లాకు అవసరమైన విత్తనాలు	పత్తి ప్యాకెట్లు	వరి(క్వింటాళ్లలో)	కంది(క్వింటాళ్లలో)
	6,70,727	14,215	1,217

తిర్యాణి: సాధారణంగా రోహిణి కార్తె ఆరంభంతోనే వానాకాలం సాగుకు సంబంధించిన సీజన్ ప్రారంభమైనట్లుగా భావిస్తాం.. అలాంటి రోహిణి కార్తె ప్రారంభమై దాదాపు వారం రోజులు కావస్తోంది. దీంతో రైతులు వానాకాలం పంటల సాగుకు పూర్తిస్థాయిలో సన్నద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే మెజార్టీ రైతులు తమ వ్యవసాయ భూముల్లో దుక్కులు దున్ని విత్తనాలు విత్తేందుకు సిద్ధం చేసి ఉంచారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి సమయం దగ్గరపడుతుండడంతో పలు విత్తన కంపెనీలకు చెందిన ప్రతినిధులు గ్రామాల్లో తిరుగుతూ తమ విత్తనాలను కొనుగోలు చేయాలని రైతులను ఒప్పించే పనిలో నిమగ్నమయ్యారు.

జాగ్రత్తలు పాటించాలి

వానాకాలం సాగుకు సిద్ధమవుతున్న రైతులు విత్తన ఎంపికలో జాగ్రత్తలు పాటించకపోతే మొదటికే మోసం వస్తుందని వ్యవసాయశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే జిల్లాలోని వివిధ మండలాల్లో వందల సంఖ్యలో నకిలీ పత్తి విత్తనాల ప్యాకెట్లు అధికారులకు పట్టుబడ్డాయి. ఈ నేపథ్యంలో విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో రైతులు అప్రమత్తంగా ఉండి సరైన విత్తనాలు ఎంపిక చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేకుంటే నాణ్యత లేని విత్తనాలు, పేరు, ఊరు లేని వాటిని సైతం మంచివేనని అంటగట్టే కొందరూ వ్యాపారులు ఉంటారు. కాగా విత్తనాల స్థితిగతులను గమనించని రైతులు వాటిని కొనుగోలు చేసి ఏటా నష్టాలబారిన పడుతున్నారు. అంతేకాకుండా వర్షాలు కురియడం మొదలైందంటే చాలు అన్నదాతల్లో ఒకరకమైన హడావుడి మొదలవుతుంది. సమీపంలోని ఫర్టిలైజర్ షాపులతో పాటుగా ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారి నుంచి విత్తనాలు కొనుగోలు చేస్తుంటారు. ఇదే అదనుగా భావించిన వ్యాపారులు తక్కువ ధరకు నాణ్యతలేని విత్తనాలను అమ్ముతుంటారు. అయితే రైతులు కొన్ని జాగ్రత్తలు పాటిస్తే నకిలీ విత్తనాల బారిన పడకుండా ఉండేందుకు ఆస్కారం ఏర్పడుతుంది. కాగా క్షేత్రస్థాయిలో వ్యవసాయ శాఖ అధికారులు విత్తన ఎంపికపై రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించడంతో పాటుగా వ్యాపారులు నకిలీ విత్తనాలు అమ్మకుండా ఉండేందుకు తరచూ ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేస్తున్నారు.

ఎంపిక ఇలా..

- ప్రభుత్వ అనుమతి ఉన్న దుకాణాల్లోనే విత్తనాలు కొనుగోలు చేయాలి.
- తక్కువ ధరకు వస్తున్నాయని ప్రైవేటు వ్యక్తుల వద్ద విత్తనాలు కొనుగోలు చేయవద్దు..
- విత్తనాల ప్యాకెట్‌పై లాట్ నంబర్, కంపెనీ పేరు, డేట్ ఆఫ్ ప్యాకింగ్, లేబుల్, విత్తన మొలక శాతం సరిగ్గా ఉందో లేదో చూసుకోవాలి.
- విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా సంబంధిత షాపు నుంచి రశీదును పొందాలి.
- గ్రామాల్లో తిరుగుతూ విత్తనాలు విక్రయించే వారి వద్ద కొనుగోలు చేయవద్దు.
- లూజ్ విత్తనాలకు దూరంగా ఉండాలి.
- రశీదుతో పాటు విత్తన ప్యాకెట్ కవర్‌ను ఇంట్లో భద్రపర్చుకోవాలి. తద్వారా పంట నష్టపోయిన సమయంలో పరిహారం పొందేందుకు అవకాశం ఉంటుంది.
- దుకాణాల్లో లేదా ప్రైవేటుగా నకిలీ విత్తనాలు అమ్మినట్లు గుర్తిస్తే వెంటనే వ్యవసాయశాఖ అధికారులకు లేదా పోలీసులకు సమాచారం అందించాలి.

తప్పనిసరిగా రశీదు తీసుకోవాలి

రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా రశీదు తీసుకోవాలి. లైసెన్స్ కలిగి ఉన్న డీలర్ వద్దే విత్తనాలు కొనుగోలు చేయాలి. విత్తనాల ఎంపికపై క్షేత్రస్థాయిలో ఏఈ, ఏఈవోలు రైతులతో సమావేశం నిర్వహించి అవగాహన కల్పిస్తున్నారు. ఎక్కడైనా నకిలీ విత్తనాలు అమ్మినట్లు తెలిస్తే వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం అందించాలి.

– జాడి మిలింద్ కుమార్, ఏడీఏ, వ్యవసాయశాఖ

కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లు రద్దుచేయాలి

తిర్యాణి: కేంద్రప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన భవన నిర్మాణ కార్మిక సంఘ సమావేశంలో మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికులకు 50 ఏళ్లు నిండిన వారికి కనీస పెన్షన్ రూ.5 వేలు చెల్లించాలన్నారు. అర్హులైన కార్మికులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరుతో పాటు పిల్లల పెళ్లిలకు రూ.2లక్షల ప్రోత్సాహం అందించాలన్నారు. నాయకులు జంగు, జంగు, వెంకన్న, సంతోశ్, రవి, భీంరావు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

విద్యార్థినికి సన్మానం


దీపికను సన్మానిస్తున్న సభ్యులు

ఆసిఫాబాద్‌అర్బన్: జాతీయస్థాయి క్రీడల్లో ప్రతిభ చూపి కాంస్య పతకం సాధించిన జిల్లా కేంద్రానికి చెందిన దీపికను గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సందీప్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ మధ్యప్రదేశ్ రాష్ట్రంలో ఇటీవల జరిగిన జాతీయస్థాయిలో పోటీల్లో దీపిక తెలంగాణ తరుపున పాల్గొనడం గర్వకారణమన్నారు. ఆడపిల్లలను క్రీడల్లో ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు నాందేవ్, పోచన్న, దిలీప్, రాజశేఖర్, రవీందర్, ప్రవీణ్, ఆనంద్ రావ్, శ్రీకాంత్, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు



బోల్తాపడిన ఆటో

చింతలమానెపల్లి(సిర్పూర్): మండలంలోని అడెపల్లి గ్రామ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. బాబాసాగర్ గ్రామం నుంచి ట్రాలీ వాహనం కాగజ్‌నగర్ వైపు వెళ్తుండగా, కాగజ్‌నగర్ నుంచి ముంజంపల్లి వైపు వెళ్తున్న ఆటో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఆటో బోల్తా పడగా, ట్రాలీ వాహనం రోడ్డు కిందకు పడిపోయింది. ఆటో డ్రైవర్ దుబ్బుల అంజన్న తలకు గాయాలు కాగా, ట్రాలీ డ్రైవర్ దీపక్‌కు స్వల్ప గాయాలయ్యాయి. అంజన్నను చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. ఎస్సై ఇస్లావత్ నరేశ్ ఘటనా స్థలిని పరిశీలించి ప్రమాద వివరాలు తెలుసుకున్నారు.

నిజాయతీ చాటుకున్న ఆర్టీసీ ఉద్యోగులు



బ్యాగు అందిస్తున్న రాజశేఖర్, రమణ, గులామ్

ఆదిలాబాద్: ఆర్టీసీ ఉద్యోగులు నిజాయతీ చాటుకున్నారు. ఆదిలాబాద్ నుంచి నిర్మల్‌కు వెళ్లే బస్సులో శనివారం ప్రయాణించిన అక్రమ్ బేగం అందులోనే తన బ్యాగు మర్చిపోయింది. గుర్తించిన కండక్టర్ వి.రమణ, డ్రైవర్ ఎం. గులాబ్ ఆ బ్యాగును డిపో అసిస్టెంట్ మేనేజర్ రాజశేఖర్‌కు అప్పగించారు. వివరాలు తెలుసుకున్న డిపో అధికారులు సదరు మహిళకు ఆదివారం బ్యాగు అందించారు. అందులో 12 గ్రాముల బంగారం ఒక సెల్‌ఫోన్, రూ. వెయ్యి నగదు ఉన్నట్లు ప్రయాణికురాలు పేర్కొన్నారు. సిబ్బంది, యాజమాన్యానికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.


గాజులపేటలో చోరీ

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని గాజులపేట్‌లో గల ఓ ఇంట్లో శనివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గాజుల్‌పేట్‌లో గల తన ఇంటికి అబ్దుల్ కదిరి తాళం వేసి సమీపంలోని సోదరి ఇంట్లోకి వెళ్లి నిద్రించాడు. అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఇంటితాళం పగులగొట్టి రూ.7వేల నగదు ఎత్తుకెళ్లారు. ఉదయం ఇంటికి వచ్చిన అబ్దుల్ కదిరి పగలగొట్టిన తాళాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించాడు. సమీపంలోని పెట్రోల్ బంక్‌లో నిలిపి ఉన్న రెండు కొత్త వాహనాల బ్యాటరీలూ చోరీకి గురయ్యాయి.

యువకుడి అదృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని సంజయ్‌నగర్‌కు చెందిన 21ఏళ్ల కాంబ్లే సాయిప్రశాంత్ అదృశ్యమైనట్లు టూటౌన్ సీఐ కరుణాకర్ రావు తెలిపారు. తల్లిదండ్రులు చనిపోవడంతో మేనమామ ఇంట్లో ఉంటున్నాడు. శనివారం ఉదయం 11 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువకుడు తిరిగి రాకపోవడంతో చుట్టుపక్కల గాలించారు. ఆచూకీ లభించకపోవడంతో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

ప్రకృతి సోయగం..



చెట్టు కొమ్మల మధ్యన సూర్యుడి ప్రకాశం



గడ్డి తింటున్న చుక్కల దుప్పులు



పచ్చని మైదానంలో మెకాలు..

ప్రకృతిలో ఎన్నో అందాలు దాగిఉన్నాయి. వాటిని చూసినప్పుడు మనసుకు ఎంతో హాయిగా ఉంటుంది. అలాంటి దృశ్యాలు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అడవుల్లో ప్రకృతి ప్రేమికులకు కనువిందు చేస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు అడవి, మైదానాలు పచ్చదనం సంతరించుకున్నాయి. జన్నారం అటవీ డివిజన్ ఇందన్‌పల్లి రేంజ్ పరిధిలోని ఘనిషెట్టి కుంట సమీపంలో చుక్కల దుప్పులు ఇలా లేతగడ్డి తింటూ అటుగా వెళ్లేవారిని ఆకర్షిస్తున్నాయి. వీటిని రేంజ్ అధికారి కారం శ్రీనివాస్ కెమెరాలో బంధించారు. ఇక జన్నారం మండల కేంద్రంలో వాగుపై వంతెన సమీపంలోని చెట్టు కొమ్మల చాటు నుంచి సాయం సంధ్యాసమయం భానుడు తొంగి చూస్తున్న దృశ్యం ప్రకృతి రమణీయతకు అద్దం పడుతోంది.

– జన్నారం

మత్తు వదలరా..!

- జిల్లాలో యథేచ్ఛగా గంజాయి విక్రయం, వినియోగం
- వాట్సాప్‌లో అమ్మకం, అడ్డాలు, సమయంపై సమాచారం
- నియంత్రణకు ట్రాకింగ్ డాగ్స్ వినియోగం



ఈ ఏడాది ఫిబ్రవరి 20న జిల్లా కేంద్రంలో గంజాయి ముఠా అరెస్టు చూపుతున్న పోలీసులు

మంచిర్యాలక్రైం: జిల్లాలో గంజాయి దందాపై పోలీసు యంత్రాంగం కఠిన చర్యలు చేపడుతున్నప్పటికీ, ఈ చీకటి వ్యాపారం తగ్గడం లేదు. గంజాయి మత్తులో యువత దాడులకు తెగబడటం, బెదిరింపులతో డబ్బులు లాక్కోవడం సమాజంలో ఆందోళన కలిగిస్తోంది. రామగుండం పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా బాధ్యతలు చేపట్టిన తర్వాత, జిల్లాను గంజాయి రహితంగా మార్చడంపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. అయినా క్షేత్రస్థాయిలో ఈ దందా యథేచ్ఛగా సాగుతోంది. చిన్న ప్యాకెట్లలో గంజాయి రవాణా, విక్రయాలను గుర్తించడం పోలీసులకు పెద్ద సవాలుగా మారింది.

యువతే లక్ష్యంగా వ్యాపారం..

పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్ విద్యార్థులను గంజాయి స్మగ్లర్లు టార్గెట్ చేస్తున్నారు. ఉన్నత చదువులు చదివే యువత నుంచి రోడ్లపై తిరిగే యువకుల వరకు గంజాయికి బానిసలవుతున్నారు. గంజాయి సేవనంతో కలిగే ఆరోగ్య సమస్యలపై పోలీసులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సామాజిక బాధ్యతగా, మత్తులో ఉన్న యువతను సన్మార్గంలోకి తీసుకొచ్చేందుకు వివిధ చర్యలు చేపడుతున్నారు.

సోషల్ మీడియా వేదిక..

సోషల్ మీడియా, ముఖ్యంగా వాట్సాప్ గంజాయి అమ్మకాలకు అడ్డాగా మారింది. గంజాయి సేవించే వారు వాట్సాప్ గ్రూప్‌లు ఏర్పాటు చేసుకుని, కోడ్ భాషలో సమాచారం పంపుతూ అమ్మకాలు కొనసాగిస్తున్నారు. 100 గ్రాముల ప్యాకెట్లను రూ.200 నుంచి రూ.300కి విక్రయిస్తూ, రాత్రి 7 నుంచి 9 గంటల మధ్య నిర్దిష్ట ప్రాంతాల్లో డెలివరీ చేస్తున్నారు. శ్రీరాంపూర్ రింగ్ రోడ్, రైల్వే స్టేషన్, కాలేజీ రోడ్, రాజీవ్ నగర్, ఎన్‌టీఆర్ నగర్, జాఫర్ నగర్, అండలమ్మ కాలనీ, తిలక్‌నగర్, బైపాస్ రోడ్ వంటి ప్రాంతాలు గంజాయి అమ్మకాలకు అడ్డాలుగా మారాయి. గతంలో గంజాయి వాడకం మాస్ ఏరియాలకు పరిమితమైనప్పటికీ, ఇప్పుడు క్లాస్ ఏరియాల్లోనూ జోరుగా సాగుతోంది.

సిగరెట్లలో గంజాయి..

పట్టణ కేంద్రాల్లోని పాన్ షాపులు, టీ స్టాల్స్ వద్ద గంజాయిని సిగరెట్లలో దాచి రహస్యంగా విక్రయిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని కాలేజీ రోడ్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలోని ఓ టీ స్టాల్ గంజాయి సిగరెట్ల విక్రయ కేంద్రంగా మారిందని ఆరోపణలు ఉన్నాయి. రోజూ వందల మంది యువత ఇక్కడికి వచ్చి, కోడ్ భాషలో గంజాయి సిగరెట్లను కొనుగోలు చేస్తున్నారు.

పెరుగుతున్న బానిసలు..

పోలీసు లెక్కల ప్రకారం, జిల్లాలో గంజాయి వాడకం గణనీయంగా పెరిగింది. గతంలో పట్టణ ప్రాంతాలకే పరిమితమైన గంజాయి వాడకం ఇప్పుడు గ్రామీణ ప్రాంతాలకు విస్తరించింది. గంజాయి వ్యసనం యువతను సామాజిక, ఆరోగ్య సమస్యల వైపు నడిపిస్తోంది. పోలీసులు ఈ వ్యసనాన్ని అరికట్టేందుకు కఠిన చర్యలతో పాటు, అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నప్పటికీ, గంజాయి దందా పూర్తిగా నియంత్రణలోకి రావడం లేదు.

ట్రాకింగ్ డాగ్స్‌తో తనిఖీలు

గంజాయి వాసన పసిగట్టే ట్రాకింగ్ డాగ్స్ సాయంతో పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నారు. పాత నేరస్తుల ఇళ్లు, పాన్ షాపుల్లో రాత్రిపగలు తేడా లేకుండా తనిఖీలు చేస్తున్నారు. అయినా, కచ్చితమైన సమాచారం లేనప్పుడు గంజాయి విక్రయాలను నియంత్రించడం కష్టంగా మారుతోంది. ఈ ఏడాది జనవరి నుంచి మే 20 వరకు 30 కేసులు నమోదు కావడం, 95 మంది నిందితులను అరెస్ట్ చేయడం జిల్లాలో దందా ఏరీతిని సాగుతోందో అర్థం చేసుకోవచ్చు. ఫిబ్రవరిలో సీసీ కెమెరాల వ్యాపారం ముసుగులో గంజాయి దందా నడిపిన 22 మంది ముఠాను పట్టుకుని, 23.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మొత్తంగా, రూ.10.37 లక్షల విలువైన 34 కిలోల గంజాయిని ఈ ఏడాది స్వాధీనం చేసుకున్నారు.

రంగంలోకి ట్రాకింగ్ డాగ్స్..



గంజాయి విక్రయాలు, రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. పోలీస్ శాఖ గంజాయి నియంత్రణకు నార్కోటిక్ టీమ్‌లను ఏర్పాటు చేసింది. స్పెషల్‌గా గంజాయి నియంత్రణకు ప్రత్యేక శిక్షణ తీసుకున్న ట్రాకింగ్ డాగ్స్‌ను వినియోగిస్తున్నాం. జిల్లాకు అధికంగా మహారాష్ట్ర నుంచి వస్తుంది. సరిహద్దు ప్రాంతాల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేశాం. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా పోలీసులకు గంజాయి సమాచారం అందించి నియంత్రణకు కృషి చేయాలి. యువతను పేడదోవ పట్టకుండా కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నాం.

– ఎగ్గడి భాస్కర్, డీసీపీ మంచిర్యాల

వర్షాకాలం.. పశువులు పైలం

చెన్నూర్‌రూరల్/లక్ష్మణచాంద: వర్షాకాలం ఆరంభమైంది. ఈసారి ముందస్తుగానే వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వ్యవసాయ పనులు కూడా మొదలయ్యాయి. మరోవైపు అకాల వర్షాలకు నేల కూడా పచ్చబడింది. లేదగడ్డి పశువులను ఆకర్షిస్తోంది. ఈ నేపథ్యంలో, పశువులకు అంటు వ్యాధులు త్వరగా సోకే అవకాశం ఉందని కత్తెరసాల, లక్ష్మణచాంద పశువైద్యాధికారి సతీశ్, ఓంప్రకాశ్ సూచించారు. పశుపోషకులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా వ్యాధులను నివారించవచ్చని తెలిపారు. వర్షాకాలంలో గొర్రెలు, మేకలకు సంబంధించిన సాధారణ వ్యాధులు, వాటి లక్షణాలు, నివారణ, చికిత్స విధానాలు వెల్లడించారు.



డా.ఓంప్రకాశ్, పశువైద్యాధికారి



సతీశ్, పశువైద్యాధికారి, కత్తెరసాల



మేతకు వెళ్తున్న గొర్రెలు

గాలిపుండు (పుట్‌రాట్)

వ్యాధి లక్షణాలు: వర్షాకాలంలో చిత్తడి నేలలపై తిరిగే మేకలు, గొర్రెలకు గాలిపుండు వ్యాధి సోకే అవకాశం ఎక్కువ. ఈ బ్యాక్టీరియల్ వ్యాధి వల్ల గొర్రెలు కుంటుతూ, మూడు కాళ్లపై గెంటుతాయి. గిట్టల మధ్య ఎర్రగా కందిపోయి, చీము పట్టి నల్లగా మారుతుంది. తీవ్రమైతే గిట్టలు ఊడిపోయే ప్రమాదం ఉంది.

నివారణ చర్యలు

వ్యాధి సోకిన పశువులను వెంటనే గుర్తించి, ఆరోగ్యవంతమైన వాటికి దూరంగా ఉంచాలి.

చిత్తడి నేలలు, నీరు నిలిచే ప్రాంతాల నుంచి పశువులను దూరంగా ఉంచాలి. వర్షం నుంచి రక్షణ కల్పించే ఆరు ప్రాంతాల్లో పశువులను ఉంచాలి.

చికిత్స తర్వాత నయమైన పశువులను మాత్రమే ఆరోగ్యవంతమైన వాటితో కలపాలి.

చికిత్స విధానం

వైద్యుని సలహాతో పెన్సిలిన్, నొప్పి నివారణ మందులు వాడాలి. వ్యాధి సోకిన గిట్టలను 10% ఫార్మలిన్ లేదా కాపర్‌సల్ఫేట్ ద్రావణంలో ముంచాలి.

నీలి నాలుక వ్యాధి (బ్లూ టంగ్ డిసీజ్)

వ్యాధి లక్షణాలు: నీలి నాలుక వ్యాధి, వైరస్ వల్ల సంక్రమించే ఈ వ్యాధి దోమల ద్వారా వ్యాపిస్తుంది. వర్షాకాలంలో ఈవ్యాధి విస్తరణ అవకాశం ఎక్కువ.

లక్షణాలు: అధిక జ్వరం, చొంగ కారడం, పెదవులు, చిగుళ్లు వాచడం, ఎర్రటి గుల్లలు ఏర్పడడం.

తీవ్ర సందర్భాల్లో గిట్టలు వాచి, నాలుక నీలం రంగులోకి మారుతుంది.

పశువులు నడవలేక, మేత మేయక, అచేతన స్థితికి చేరి కిందపడిపోతాయి.

నివారణ చర్యలు: ఈగలు, దోమల నివారణకు రోజుకు రెండుసార్లు వేప ఆకులతో పొగ వేయాలి. బురద, నీరు నిలిచే ప్రాంతాలను శుభ్రం చేయాలి.

చికిత్స విధానం

పశువైద్యుడిని సంప్రదించి, యాంటీబయోటిక్, నొప్పి నివారణ మందులు వాడాలి.

నోటి పుండ్లను పొటాషియం పర్మాంగనేట్ ద్రావణంతో కడిగి, జింక్ పౌడర్ రాయాలి.

గిట్టల పుండ్లకు హిమాక్స్, లేమనెంట్ వంటి ఆయింట్‌మెంట్‌లు వాడాలి.

చిటుకు వ్యాధి..

తొలకరి గడ్డిలో క్లాస్ట్రీడియం ఫర్ ఫ్రింజర్స్ టైప్–డి అనే రకం సూక్ష్మజీవులు ఉంటాయి.ఈ సూక్ష్మ జీవులు గాలి లేని వాతావరణంలో ఎక్కువగా వృద్ధి చెందుతాయి. తొలకరి పిచ్చి గడ్డిని జీవాలు తిన్నప్పుడు జీవాల పేగుల్లో గాలి లేని వాతావరణం ఏర్పడి అక్కడ సూక్ష్మజీవుల వల్ల ఏర్పడిన విష పదార్థాల వల్ల ఈ చిటుకు వ్యాధి వస్తుంది.

వ్యాధి లక్షణాలు:

వ్యాధి సోకిన గొర్రెలు కొన్నిసార్లు ఎటువంటి లక్షణాలు లేకుండానే ఆకస్మికంగా మరణిస్తాయి. కొన్ని ఎగిరి కిందపడి కాళ్లు కిందకు కొట్టుకుంటూ, పళ్లు కొరుకుతూ చనిపోతాయి. వ్యాధి సోకిన గొర్రెలు చొంగ కారుస్తాయి. శ్వాస అధికంగా ఉంటుంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు...

చికిత్స కంటే నివారణ ముఖ్యం. మే నుంచి జూలై వరకు వ్యాధినిరోధక టీకా(మల్టీ కాంపోనెంట్ ఈటీ వ్యాక్సిన్) వేయించాలి. వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే దగ్గరలో పశు వైద్యాధికారికి తెలియ చేసి చికిత్స చేయించాలి. తొలకరి చినుకులకు మొలిచిన గడ్డి మేయకుండా చూసుకోవాలి. వ్యాధి సోకిన జీవాలను మంద నుంచి వేరు చేయాలి.

సత్యపాల్‌రావుకే ఐఎన్‌టీయూసీ మద్దతు

కాసిపేట:కాసిపేట మండలం దేవాపూర్ సిమెంట్ కంపెనీలో జరగనున్న గుర్తింపు సంఘం ఎన్నికల్లో సత్యపాల్‌రావుకే ఐఎన్‌టీయూసీ మద్దతు ప్రకటించింది. ఈమేరకు రాష్ట్ర కనీస వేతనాల బోర్డు చైర్మన్, ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్ ప్రసాద్ తెలిపారు. ఓరియంట్ సిమెంట్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ మొదటి నుంచి ఐఎన్‌టీయూసీకి అనుబంధంగా ఉందని పేర్కొన్నారు. సత్యపాల్‌రావు తండ్రి రఘుపతిరావు ఐఎన్‌టీయూసీ మద్దతుతో ఇదే పలుమార్లు పోటీచేసి గెలిచారని గుర్తు చేశారు. ప్రస్తుతం కొందరు ఎమ్మెల్యేలు మద్దతు తెలుపుతున్న యూనియన్, అభ్యర్థికి ఐఎన్‌టీయూసీతో సంబంధం లేదని స్పష్టం చేశారు. ఐఎన్‌టీయూసీ కార్మికులకు అండగా ఉంటుందని తెలిపారు. సత్యపాల్‌రావును గెలిపించాలని కోరారు.

దేవాపూర్‌లో మోటర్ సైకిల్ ర్యాలీ

కాసిపేట: మండలంలోని దేవాపూర్‌లో సత్యపాల్ రావుకు మద్దతుగా నాయకులు, కార్మికులు మోటర్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఆదివాసీ గ్రామ పటేళ్లు, ఆదివాసీ సంఘాల నాయకులు, తెలంగాణ ఓరియంట్ స్టాఫ్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు సతీష్‌రెడ్డి, ఓరియంట్ సిమెంట్ కంపెనీ కార్మిక నాయకులు రమణారెడ్డి మద్దతు తెలిపి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు.

ఆవుదూడను చంపిన కేసులో నిందితుడి అరెస్ట్

ఆదిలాబాద్‌టౌన్: ఆవుదూడను చంపిన కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి తెలిపారు. డీఎస్పీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. భోరజ్ మండలం సిర్సన్న గ్రామానికి చెందిన సాయికుమార్‌కు చెందిన ఆవుదూడను అదే గ్రామానికి చెందిన రాథోడ్ సంజయ్ గిమ్మ శివారులో కత్తితో పొడిచాడు. జైనథ్ సీఐ సాయినాథ్, ఎస్సై గౌతమ్ అక్కడికి చేరుకోగా కొద్ది సేపటికే ఆవుదూడ మృతిచెందింది. పోలీసులు సంజయ్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా నేరాన్ని ఒప్పుకున్నట్లు వివరించారు. ఆవుదూడను చంపి అటవీ జంతువుల మాంసంగా అమ్మేందుకు ప్రయత్నం చేసినట్లు తెలిపారు. నిందితుడిపై గతంలో మేకల దొంగతనం, గుడిలో దొంగతనం, ఫారెస్ట్ కేసులు నమోదై ఉన్నట్లు పేర్కొన్నారు.

ఉత్తమ 'సేవా' పతకాలు

- ఉమ్మడి జిల్లాలో పలువురు పోలీసులు ఎంపిక

ఆదిలాబాద్‌టౌన్: రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా పోలీసు శాఖలో ఉత్తమ సేవలు అందించిన అధికారులు, సిబ్బందికి పోలీసు శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరి రవి గుప్తా ఆదివారం పతకాలను ప్రకటించారు. తెలంగాణ శౌర్య పతకం కింద రూ.10వేల నగదు, తెలంగాణ మహోన్నత సేవా పతకం కింద రూ.40వేలు, తెలంగాణ ఉత్తమ సేవా పతకం కింద రూ.30వేలు, తెలంగాణ కఠిన సేవా పతకం కింద రూ.20వేలు, తెలంగాణ సేవా పతకం కింద రూ.20వేల నగదు అందజేసి సత్కరించనున్నారు. ఉమ్మడి జిల్లాలో పలువురు మహోన్నత, ఉత్తమ సేవా, సేవా పతకాలకు ఎంపికయ్యారు.

మహోన్నత సేవా పతకం : రామకృష్ణ, ఆర్ఐ, 2వ బెటాలియన్ యాపల్‌గూడ

ఉత్తమ సేవా పతకం : కె.నర్సయ్య, ఎస్సై, పీసీఆర్, ఆదిలాబాద్

ఎండీ తాహెర్‌ఖాన్, హెడ్‌కానిస్టేబుల్, సోన్, నిర్మల్

ఇంటెలిజెన్స్..

- ఎస్.లింగారెడ్డి, ఏఎస్సై, ఆదిలాబాద్ జోన్
- పి.శ్రీధర్, హెచ్‌సీ, ఆదిలాబాద్ జోన్

జిల్లాల వారీగా సేవా పతకాలకు ఎంపికైన వారు..

ఆదిలాబాద్..

- విష్ణుప్రకాశ్, ఎస్సై, టూటౌన్
- బి.రవీందర్ రెడ్డి, హెచ్‌సీ, గుడిహత్నూర్
- ఎ.నాగేశ్వర్, పీసీ, గాదిగూడ
- కె.కిషన్, ఏఆర్ పీసీ, ఆదిలాబాద్
- ఎ.రాములు, ఏఆర్ కానిస్టేబుల్, ఆదిలాబాద్
- సీహెచ్ గోపాల్, కానిస్టేబుల్, గాదిగూడ
- డి.రమేశ్, హెచ్‌సీ, టీజీఎస్‌పీ 2వ బెటాలియన్
- జి.నర్సయ్య, హెచ్‌సీ ఈజీఎస్‌పీ, 2వ బెటాలియన్

కుమురంభీం ఆసిఫాబాద్..

- రాజేందర్ ప్రసాద్, సీఐ, కాగజ్‌నగర్
- శ్రీనివాస్, ఎస్సై, ఆసిఫాబాద్
- తిరుమల, డబ్ల్యూ ఎస్సై, భరోసా సెంటర్, ఆసిఫాబాద్
- బాలాజీ, ఏఎస్సై, కాగజ్‌నగర్
- బీహెచ్ శ్రీనివాస్, ఏఆర్ హెడ్‌క్వార్టర్స్, ఆసిఫాబాద్
- ఎండీ అజీమొద్దీన్, హెచ్‌సీ, సిర్పూర్(టి)
- షేక్ ఇమామ్, ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్, ఆదిలాబాద్
- విశ్వజీత్, ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్, ఆసిఫాబాద్

నిర్మల్..

- ఎండీ సిద్ధిఖీ హుస్సేన్, ఎస్సై, నిర్మల్
- ఎం. హనుమాండ్లు, ఏఎస్సై, నిర్మల్
- మారుతి, ఏఎస్సై, భైంసా రూరల్ పీఎస్
- అబ్దుల్ నయీమ్, ఏఆర్ ఎస్సై, దార్, నిర్మల్
- రాథోడ్ భీంరావు, ఏఎస్సై, దిలావర్‌పూర్
- రామారావు హెచ్‌సీ, డీఎస్బీ, నిర్మల్
- గంగారెడ్డి, హెచ్‌సీ, దిలావర్‌పూర్
- పెద్ద రాజన్న, హెచ్‌సీ, భైంసా
- చిన్నయ్య, హెచ్‌సీ, డీఎస్బీ, నిర్మల్
- డి.సుదర్శన్, పీసీ, తానూర్
- సూర్యవెంకటి, పీసీ, లక్ష్మణచాంద
- మాణిక్‌రావు, పీసీ, ముథోల్
- శివకుమార్, పీసీ, సోన్

మంచిర్యాల..

- డి.సురేందర్, ఏఆర్ ఎస్సై, గుడిపేట, మంచిర్యాల 13వ బెటాలియన్